కథ

# నాణానికి మరోవైపు

''అమ్మా సావిత్రమ్మగారూ! మీకు ఉత్తరం వచ్చింది. ఇదిగోండి'' అంటూ దాన్ని నాకందించి వెళ్ళిపోయాడు పోస్ట్‌మేన్.

''ఎక్కడ నుంచి వచ్చిందో?'' అనుకుంటూ ఉత్తరాన్ని విప్పి చూసాను. రాసింది కోడలు సారిక అని చూడగానే కాస్త కుతూహలంతో చదవసాగాను.

''గౌరవనీయులైన అత్తయ్యగారికి. మీ కోడలు సారిక నమస్కరించి వ్రాయునది. మేమంతా క్షేమమే. మీరెలా వున్నారోనని మాకెంతో దిగులుగా వుంది. మీకోసం పిల్లలు అరుణ్, అక్షయ్ మరీ ఏడుస్తున్నారు. అయినా మీ చాదస్తంగానీ లంకంత ఇల్లు, కేరింతలు కొట్టే మనవళ్లుండగా కాదని పాడుబడ్డ ఆ పల్లెటూళ్ళో ఒంటరిగా మోడువారిన చెట్టులా ఎన్నిరోజులుంటారు. నేను మాత్రం ఏమన్నానని ఆనాడలా అలిగి వెళ్లిపోయారు. ఉన్న మీరొక్కరు ఇక్కడుంటే మాకూ నిశ్చింత. అందుకని మీరు వెంటనే మా దగ్గరకొచ్చేయండి. మీరు కావాలని పిల్లలు మారాం చేస్తున్నారు. కనుక తొందరగా బయలుదేరి రాగలరు. మీ రాకకై ఎదురు చూస్తుంటాం. మీ కోడలు సారిక.''

అమితాశ్చర్యంతో ఉత్తరం చదవడం పూర్తి చేసాను.

సారికలో వచ్చిన ఈ అనూహ్య మార్పుకు నేను మంత్రముగ్ధురాలినయ్యాను. ఆమెలో ఈ మాత్రం దయార్ద్ర హృదయం వుందంటే తను నమ్మలేకపోతోంది. ఎందుకంటే?

''ఏవండీ! మీ అమ్మగారి చాదస్తం కాకపోతే తిన్న పళ్లాలు కడుక్కోక, కట్టుకున్న బట్టలు ఉతుక్కోకపోతే ఎలాగండీ?'' అని సారిక తన గురించి కొడుకు శేఖర్‌కు ఫిర్యాదు చేస్తుంటే విన్నాను. ఇప్పుడెలా నమ్మేది?

''పానకంలో పుడకలా మీ అమ్మగారు, ఆవిడ పూజలూను. అబ్బబ్బ ఆ జపతపాలు, వ్రతాలు చూస్తుంటే భరించలేకపోతున్నానండీ. ఆవిడ్ని తొందరగా మన ఇంటి నుంచి పంపించివేయండి. కాసింత ప్రశాంతంగానైనా వుంటుంది'' అని సారిక శేఖర్‌కు సలహా ఇస్తూ ఉంటే అది తను విని తెల్లారే మూటా ముల్లె సర్దుకుని ఈ సొంత గూటికొచ్చి ఇలా ఒంటరి జీవితం వెళ్ళదీస్తున్నాను.

నాకు మాత్రం ఇక్కడ వుండాలనుందా? ఉన్న నాలుగు రోజులూ మనవళ్లతో నవ్వుతూ వుండాలని వుంది. ఈ వృద్ధాప్యంలో చిన్నపిల్లల నుంచి ఎంతో ఆనందం లభిస్తుంది. ముసలితనానికి ఈ ఒంటరితనం ఎంతటి నరకమో అనుభవిస్తున్న నాకు తెలుసు.

కొడుకు శేఖర్ ఇంట్లో పిల్లలకి కాకమ్మ కథలు చెప్తుకుంటూ నన్ను నేను మర్చిపోయి ఆనందంగా గడపాలనుకున్నాను. కానీ కోడలు నిర్వాకమే నాకు నచ్చలేదు. ఇంత వయసులోనైనా ఊర్కే కూర్చోవడం నాకిష్టం వుండదు. ఎప్పుడూ ఏదోక పని చేస్తూనే వుంటాను. అలా ఆ ఇంట్లో క్షణం తీరిక లేకుండా పని చేసేదాన్ని. అంత చేసినా నేనేమీ పని చేయడంలేదంటూ సారిక వాడి దగ్గర నా గురించి లేనిపోనివి చెప్పి వాడికి నేనంటే అసహ్యమేసేలా చేసింది. వాడూ సారిక చేతిలో కీలుబొమ్మ. ఏది చెబితే అది విని నమ్మెయడం తప్ప స్వంత ఆలోచనలేం లేవు.

''నువ్వీ ఇంట్లో వుండడం మాకిష్టంలేదు'' అని వాళ్ళు పైకి అనకపోయినా నాపట్లవారి ప్రవర్తనా విధానం నన్ను ఇక్కడికొచ్చేలా చేసింది. ఈ వయసులో భౌతికానందం కన్నా మానసిక ఆనందమే సుఖాన్నిస్తుంది. కానీ అదే నాకు కరువైతే ఇంకా అక్కడ నేనెందుకుండాలి?

ఒక్కోసారి పిల్లల అల్లరి, చిలిపితనం గుర్తొస్తుంటే చాలా బాధేస్తుంది. కానీ తర్వాత సారిక మూతివిరుపు, విసుగు, కోపం కళ్లముందు మెదలగానే ఇక్కడే వుండడం సబబు అని అనిపిస్తుంటుంది.

నాపై కోడలికి ఇప్పుడేం ప్రేమ పుట్టిందోగానీ 'వెంటనే వచ్చేయండి అత్తయ్యా' అని ఉత్తరం రాసింది.

పైకెంత వద్దనుకున్నా హృదయంలో మాత్రం కొడుకు సమక్షంలోనే గడపాలని కోరిక బలంగా వుంది. జీవితపు చివరి దశలో ఆత్మీయుల అనురాగాన్ని అనుభవించాలని ఎవరికి మాత్రం ఉండదంటే? ముఖ్యంగా పిల్లలు. ఏది ఏమైనప్పటికీ నేను వెళ్లాల్సిందే. వెళ్తున్నానంతే. కానీ ఒకటే ఆశ్చర్యంగా వుంది. నేనంటే అంత అసహ్యించుకుని చిరాకుపడే కోడలు ఇప్పుడు ప్రేమని ఒలకపోస్తూ రమ్మని ఉత్తరం రాయడంలో భావమేమిటో?

★★★

''అత్తయ్యా! బాగున్నారా?'' అడిగింది సారిక.

''బాగానే వున్నానమ్మా!'' చెప్పాను.

''మీరెళ్ళి చాలారోజులైంది. కనీసం ఒక్క లెటరైనా రాయలేదేం? మీ ఆరోగ్యం ఎలా వుందోనని మాకంతా బెంగగా వుండేది. ఆయన, పిల్లలు మిమ్మల్ని గుర్తు చేయని రోజంటూ లేదు'' అంటూ సారిక నా చేతిలోని బ్యాగ్ అందుకుని అంది.

సారికకు ఆ మాటలు హృదయంలోంచి వచ్చాయో లేక మనసులోంచి వచ్చాయో తెలీదు గానీ మొదటిసారిగా కోడలు నాతో ఇంత తీయగా మాట్లాడడాన్ని ప్రపంచంలోని ఎనిమిదవ వింతగా ఫీలయ్యాను.

''శేఖర్ ఇంకా రాలేదామ్మా?'' అడిగాను.

''రాలేదత్తయ్యా.''

''మరి పిల్లలో?''

''అదిగో ఇప్పుడే స్కూలు నుంచి వస్తున్నారు. వెనక్కి తిరిగి చూడండి'' అంది.

నేను వెనక్కి తిరగి చూడక ముందే అరుణ్, అక్షయ్‌లు నన్ను చుట్టేసుకున్నారు. అరుణ్‌కి ఎనిమిది, అక్షయ్‌కి ఆరేళ్లుంటాయి.

''బావున్నార్రా?'' వారి తలలు నిమురుతూ అన్నాను.

''ఓ'' అన్నారిద్దరూ.

కాళ్ళు కడుక్కుని అన్నం తినడమే ఆలస్యం 'అనగనగా ఒక రాజు' అని మొదలుపెట్టింది కాదు.

రోజులు చాలా ఆనందదాయకంగా గడుస్తున్నాయి. వికసించిన ప్రతి పూవు ఆనందమనే పరిమళాన్ని గుబాళించినట్టు ప్రతి మనిషి ముఖంపై వికసించే చిరునవ్వు వారికి ఆనంద సౌరభాన్ని ఇస్తుందని తెలుసుకున్నాను.

ఈ ఆనందాన్ని నా స్నేహితురాలు లక్ష్మికి చెప్పడానికని ఓల్డేజ్ హోమ్‌కి ఫోన్ చేసాను. కాసేపటికి లక్ష్మి లైన్‌లోకి వచ్చింది.

''హలో లక్ష్మీ! బాగున్నావా?'' అడిగాను.

''సావిత్రీ! నువ్వా? నేను బాగానే వున్నానుగానీ ఎన్నిరోజులకిలా దయచేశావు. ఇంతకీ నువ్వెలా వున్నావు? ఎక్కడ వుంటున్నావు?''

''కొడుకు శేఖరం ఇంట్లోనే వుంటున్నాను. కోడలు నన్ను బాగానే చూసుకుంటోంది. నేనెంతో హేపీగా, సుఖంగా వున్నానిక్కడ.'' అన్నాను.

నాలా ఇలాంటి సుఖం ఆమెకు దొరక్కపోతున్నందుకు నాపై ఈర్ష్యతో ఫీలవుతున్నదని తెలుసు.

''మంచిది. నువ్వెంతో అదృష్టవంతురాలివి. నాకంత భాగ్యంలేదు.''

నేను చిన్నగా నవ్వుకుంటూ అహాన్ని ముఖం నిండా పులుముకున్నాను. తనే అంది ''ఎప్పుడైనా నీవాళ్ళనుండి నువ్వు దూరమైతే మాత్రం తప్పకుండా ఇక్కడికే వచ్చేయ్'' అని.

''మంచిది'' అని చెప్పి ఫోన్ పెట్టేశాను.

'ఆ హోమ్‌లో ఉండడానికి నీ అంత దుర్గతి నాకు పట్టలేదులే. ఇక్కడ నా కొడుకు, కోడలు, పిల్లలతో ఎంతో సుఖంగా ఉన్నాను' అని మనసులో కాసింత గర్వంగా ఫీలవుతూ అనుకున్నాను.

లక్ష్మికి ఇద్దరు కొడుకులు. భర్త ఎప్పుడో పోయాడు. ఆమె చేతిలో ఆస్తి వున్నంత కాలం కొడుకు

లామెను బాగానే చూసుకున్నారు. ఎప్పుడైతే ఆ ఆస్తిని కొడుకులకు పంచి ఇచ్చిందో ఆ క్షణమే లక్ష్మిని బయటకి గెంటేసారు. ఇక వేరే దిక్కు లేక ఓల్డేజ్ హోమ్‌లో జీవనం గడుపుతోంది. అదీ లక్ష్మి బయోగ్రఫీ.

తీరిక లేకుండా పని చేయడం నాకలవాటేగదా! అందుకని కోడలు చేసే ఇంటి పనుల్లో ఆమెకి సాయపడసాగాను. ఇల్లు ఊడ్చటం, గిన్నెలు తోమడం, వంట చేయడం, పిల్లలకి స్నానం చేయించడం దగ్గరుండి అన్నం తినిపించడం, బట్టలుతకడం వగైరా పనులన్నీ చేస్తూనే వున్నాను.

''వద్దత్తయ్యా! మీరేం పని చేయవద్దు. మీ ఆరోగ్యం బాగాలేదు. అయినా నేనున్నానుగా. ఈ వయసులో మీకెందుకీ శ్రమ'' అని సారిక ఎంత వారించినా చేస్తూనే వున్నాను. అలాని చేయకపోతే నాకేం తోచదు.

రోజులు గడుస్తున్నకొద్దీ రాన్రాను ఈ ఇంటి పనంతా నేనే చేయాల్సి వస్తోంది. కోడలు నామమాత్రంగానే చేస్తోంది.

పొద్దున సారిక లేటుగా నిద్ర లేవడంవల్ల పని భారం నాపై పడుతోంది. పని వత్తిడి పెరిగేకొద్దీ నాకు చాలా కష్టంగానే ఉంది.

''అత్తయ్యా! పనంతా మీరే చేస్తున్నారు. అలాగని మీకు కష్టం అనిపిస్తే మాత్రం చేయకండి'' అంటూ వుంటుంది సారిక.

మరికొన్ని రోజులు గడిచేసరికి ఇక ఇంటి పని నా బాధ్యతే అయింది. ఇప్పుడు సారిక ఏ పని ముట్టుకోవడంలేదు. కనీసం తను తిన్న పళ్లెం కూడా కడుక్కోవడంలేదు. నాకేమో చిరాకు, విసుగేస్తోంది. అనుక్షణం పని! పని! పని! అసలే పెద్దదాన్ని. అధిక పని, తక్కువ తిండి అయ్యేసరికి నా ఒంట్లో శక్తి సన్నగిల్లింది. పని పెరుగుతోంది. బలం తగ్గుతోంది. ఒక్కోసారి దుఃఖం వచ్చేస్తోంది. ఏడ్చేస్తాను కూడా!

నేను వచ్చిన మొదటి రోజుల్లో ''వద్దొద్దు మీరు ఏ పని ముట్టుకోవద్దత్తయ్యా'' అన్న సారిక ఇప్పుడు చిరునవ్వుతో నాకే పని హుకుం జారీ చేస్తోంది. ఏ కొంచెం ఆలస్యమయినా ''ఆ పని చేయండి, ఈ పని చేయండి'' అని మర్యాదగానే చెప్తోంది. కొంచెం కటువుగా, కోపంగా చెబితే నేను చేయనని మొండికేసే దాన్ని. కానీ ఆప్యాయతతో చెప్తోంది కాబట్టి చేయంది కాదు.

భౌతికానందంకన్నా, మానసిక ఆనందమే నాకు సుఖాన్నిస్తుంది. కాబట్టి సారిక ఆత్మీయత నా మనసుకి సుఖాన్నివ్వడం వలన ఆ పని చేయడమనే భౌతిక కష్టాన్ని కాదనలేకపోతున్నాను. అయితే ఆ మొహమాటమే నా పీకల మీదికొచ్చింది. ఆరోగ్యం క్షీణించింది. మంచం పట్టాను.

మధ్యాహ్నం సారిక ఫోన్లో వాళ్ళ అమ్మతో మాట్లాడుతోంది.




''అమ్మా! నేను సారికని మాట్లాడుతున్నాను.''

''...''

''ఎవరు? అత్తయ్యగారా? నిద్రపోతున్నారు.''

''...''

''అవును పనంతా నేనే చేస్తున్నాను. తప్పింది కాదు. అత్తయ్య కోలుకుని పల్లెకి రావాలంటే చాలా టైమ్ పడుతుంది. అత్తయ్య ఉంటే ఇంటి పనంతా చేస్తుందని, పని మనిషిని మానిపించేసి అత్తయ్యతో చేయిస్తున్నాను. అత్తయ్య ఉండడంవలన ఒక సంవత్సరంలో పని మనిషికి పోయే డబ్బుని ఆదా జేసాను. అత్తయ్యేదో పనిమనిషిగా పనికొస్తుందని కాస్త ప్రేమని ఒలకబోస్తున్నానంతే. దాంతో ఆమె తెగ సంబరపడిపోతూ ఈ ఇంటి చాకిరి చేస్తోంది. ఏదో పనికి పని, అత్తయ్యను కన్నతల్లిలా చూసుకుంటున్నానన్న గుర్తింపు ఈ రెండూ లభిస్తున్నాయమ్మా'' అంటూ ఫోను పెట్టేసింది సారిక.

ఇది విన్న నాకు మతి పోయినట్టయింది. అనుబంధం తెర చాటున ఎన్ని కల్తీ చారలు. ఇన్నిరోజులు తనున్నది ఆఫ్టరాల్ ఒక పని మనిషి స్థానంలోనన్న మాట. నన్నెంత స్వలాభం కొరకు వాడుకుంటున్నదో ఇప్పుడు తెలుస్తోంది.

అయినా నేను మొదట్లోనే అనుకున్నాను. నన్నింత ప్రేమగా చూసుకుంటున్నదంటే దాని వెనుకేదో స్వార్థం వుందని, ఇన్ని రోజులు నాణానికి ఒకవైపే సారిక ప్రేమని చూసాను. కానీ ఇంకోవైపుస్వార్థాన్ని మాత్రం ఇప్పుడు చూస్తున్నాను.

ఈ తరం వారసులందరూ ముసలాళ్ల వెనుకున్న ఆస్తి, డబ్బుని చూసి ఆదరిస్తున్నారు తప్ప అసలైన ప్రేమతో మాత్రం కాదు.

ఇప్పుడేం చేయాలి? ఇక్కడే వుంటే ఆరోగ్యం కాస్త కుదుటపడ్డాక మళ్లీ నాకు ఆ పనిమనిషి డ్యూటీ ఎలాగూ తప్పదు. నాదేమో పని చేసే వయసు కూడా కాదాయే. ఈ స్వార్థపు ప్రేమలో బ్రతికేకన్నా ఎక్కడో కాస్త స్వచ్ఛమైన చిరునవ్వు దొరికే చోటుకెళ్లాలి. అలాగని సొంత ఊరికెళ్లి ఒంటరిగా గడపడంకన్నా నరకం మరోటిలేదు.

అందుకే ఓ నిర్ణయానికొచ్చాను.

మంచంలోంచి కష్టంగా లేచాను. కళ్ళు చీకట్లు కమ్ముతున్నాయి. ఫోన్ దగ్గరికెళ్లి దాన్ని చేతిలోకి తీసుకుని ఓల్డేజ్ హోమ్‌కి లక్ష్మికోసం ఫోన్ చేసాను.

''హలో లక్ష్మీ! బాగున్నావా? నేను సావిత్రిని మాట్లాడుతున్నాను. అసలు విషయమేంటో విను. నాకీ ఇంట్లో వుండడం ఇష్టంలేదు. త్వరలో నేనూ మీ హోమ్‌కే వస్తున్నాను'' అని చెప్పి ఫోన్ పెట్టేసాను.

ఎదురుగా సారిక బిత్తరపోయి చూస్తోంది.

☆

**చింతా శంకర్**